క్లుప్తంగా

'ఎస్‌ఐ చేయి చేసుకున్నాడు..'

పినపాక: అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పినప్పటికీ వినకుండా ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ తనని కొట్టారంటూ రాయగూడెం గ్రామానికి చెందిన కొంబత్తిని శ్రీను ఆరోపించారు. ఈ మేరకు బాధితుడు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో చోటుచేసుకున్న ఓ వివాదానికి సంబంధించి స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై.. పక్షవాతంతో బాధపడుతున్నప్పటికీ మహిళపై దాడి చేశావంటూ ఇష్టానుసారంగా కొట్టాడని బాధితులు ఆరోపించాడు. ఈ విషయంపై ఉన్నతాధికారుల విచారణ చేపట్టి న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు. ఈ విషయమై ఎస్సై రాజ్ కుమార్‌ను వివరణ కోరగా.. వివాదానికి సంబంధించి పిలిపించి వివరాల మాత్రమే సేకరించామని, అతనిపై చేయి చేసుకోవడం అవాస్తవమని తెలిపారు.

రేపు 'చలో పూసుగూడెం'

ములకలపల్లి/అశ్వాపురం/కరకగూడెం: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేపు (సోమవారం) జరుపతలపెట్టిన 'చలో పూసుగూడెం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ములకలపల్లి మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, అశ్వాపురం మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, కరకగూడెం మండల అధ్యక్షుడు రావుల సోమయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఆయా ప్రాంతాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ వద్ద జరిగే బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోత్సరణ నడమ భక్తులు వీక్షిస్తుండగా స్వామివారి క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పది గంటల పని విధానం తగదు..

అశ్వారావుపేటరూరల్: లేబర్ కోడ్ అమలులోకి రాకముందే తెలంగాణ రాష్ట్రంలో 10గంటల పని విధానానికి క్యాబినేట్ ఆమోదించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో జూలై 9 తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని దుకాణదారులకు సమ్మె నోటీసులు ఇవ్వడంతోపాటు ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజుకు కుడా అందించారు. నాయకులు కేసుపాక నరసింహారావు, ఏసు, నాగేంద్ర, శ్రీకాంత్, బుజ్జమ్మ, భూషణం, రాణి, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

దుమ్ముగూడెం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో సీపీఎం సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, మాజీ డీసీసీబీ చైర్మన్ ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం స్వామి, ఎలమంచి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై నిరసన

బూర్గంపాడు: కరెంట్ కోతలను నిరసిస్తు తాళ్ల గొమ్మూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని నాయకులు ఆరోపించారు. నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, వెలిశెట్టి రామారావు, కారం సాయికిరణ్, గనిబోయిన శ్రీనివాస్, కొడెబోయిన రవిపటేల్, అంగోత్ సంతోష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలను నియంత్రించాలి

ములకలపల్లి: ములకలపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణ సమీపంలోని దుకాణాల్లో మద్యం విక్రయాలని నియంత్రించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్కా అజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఎం లతకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్న నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకోవానికి పేర్కొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బేతిని కుటుంబరావు(65) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా.. ఆ పార్టీ జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, కుటుంబరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, పిట్టల అర్జున్, మోరంపూడి పాండురంగారావు, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుట్టిన రోజున రక్తదానం చేస్తున్న కమలాకర్



మొక్కలు నాటుతున్న చిన్నారి ధరణి



అనాథాశ్రమంలో చిన్నారుల సేవలో ఓ కుటుంబం

వేడుకల్లో కొత్త ఒరవడి

- పుట్టినరోజు కేక్ కాదు.. మంచి పనులకే పట్టం
- యువతలో వెల్లువెత్తుతున్న సామాజిక స్పృహ
- కొత్త ఆలోచనలు.. గొప్ప ఆదర్శాలతో ముందుకు..

సండే స్పెషల్

కరకగూడెం: ప్రస్తుతం చాలా మంది ఈ సంప్రదాయ విధానాలకు భిన్నంగా తమ పుట్టినరోజును సేవా కార్యక్రమాలకు వేదికగా మార్చుకుంటున్నారు. అనాథాశ్రమాలకు వెళ్లి అక్కడి చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్నారు. వారికి మిఠాయిలు, బట్టలు పంచిపెట్టి వారి ముఖాల్లో చిరునవ్వులు చూసి ఆనందిస్తున్నారు. వృద్ధాశ్రమాల్లోని పెద్దవారితో సమయం గడపుతున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. వారికి అవసరమైన మందులు, పండ్లు, భోజనం అందిస్తున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందించడం వంటి కార్యక్రమాలతో వారికి మానసిక ధైర్యాన్నిస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుతున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురుచూసే ఎందరికో ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. స్నేహితులను, కుటుంబ సభ్యులను కూడా ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. అడవుల్లో కోతులకు ఇతర మూగజీవాలకు పండ్లు, ఆహారం అందించడం వాటి సంరక్షణకు పాటుపడటం వంటి కార్యక్రమాలతో జీవకారుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వీటికి తోడు మరికొందరు పెళ్లిరోజు, ఉద్యోగం వచ్చిన తరువాత ఇలానే వేడుకలను ఇలానే చేసుకుంటున్నారు. మొదటి నెల శాలరీలో సగభాగం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ఖర్చుచేయడం కనిపిస్తోంది.

> పుట్టిన రోజు వేడుకను చేసుకోవడంలో ఒక్కొక్కరిది ఒక్కో పంథా. ఇన్నాళ్లు ఆడంబరమైన పార్టీలు, కేకులతో సంబురాలు జరిపిన యువత.. ఇప్పుడు కొత్తగా ఆలోచిస్తున్నారు. సమాజానికి మేలు చేసే పనులు చేస్తూ.. నలుగురితో సంతోషాన్ని పంచుకుంటున్నారు. వేడుకల నిర్వచనాన్నే మార్చేస్తున్నారు.

మరింత మందికి స్ఫూర్తిగా..

వేడుకల్లో చేస్తున్న ఈ సేవా స్పృహ.. సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడుతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా భాగస్వాములను చేయడంతో వారిలోనూ ఇలాంటి ఆలోచనలే రేకెత్తే అవకాశం ఉంది. ఇది క్రమంగా మరింత మందికి స్ఫూర్తినిస్తుంది. ముఖ్యంగా యువత ఈ దిశగా అడుగులు వేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ఒక మంచి బాట వేస్తున్నట్లవుతోంది. చిన్నారులను చిన్నతనం నుండే సామజిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా చేస్తోంది. ఈ కొత్త ఒరవడి సమాజంలో మరింతగా విస్తరించాలని ఆశిద్దాం.

పేదల సేవే నిజమైన వేడుక..



నా పుట్టినరోజు, నా పిల్లల పుట్టినరోజును ఎప్పుడూ కేక్ కట్ చేసి పార్టీలతోనే జరుపుకునేవాడిని. కానీ కొన్నేళ్ల నుంచి రక్తాన్ని దానం చేస్తూ వస్తున్న. దీనికంటే పెద్ద బహుమతి మరొకటి ఉండదని భావిస్తున్నాను. నా రక్తంతో ఒక ప్రాణం నిలిస్తే నా పుట్టినరోజుకు నిజమైన సార్ధకత చేకూరుతుంది. అలాగే ఆపదలో ఉన్న పేదలకు సేవ చేయడమే నిజమైన వేడుక.

– సిరిశెట్టి కమలాకర్, కరకగూడెం

సేవతోనే ఎనలేని సంతృప్తి..



నా కుమారుడు ఆర్యిక్ పుట్టిన రోజున అనాథాశ్రమంలోని చిన్నారులతో కలిసి భోజనం చేయడం ఒక అద్భుతమైన అనుభూతిని ఇచ్చింది. వారి కళ్లలో కనిపించిన ఆనందం, వారి ముఖాల్లోని చిరునవ్వుతో నా మనసు నిండిపోయింది. కేక్ కట్ చేసి పార్టీ చేసుకుంటే వచ్చే ఆనందం కన్నా ఇది వెయ్యిరెట్లు ఎక్కువ. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను.

– నాగబండి జయబాబు, కరకగూడెం

ప్రకృతికి మేలు చేయడంలో ఆనందం



పుట్టినరోజున మొక్కలు నాటడం ద్వారా పర్యావరణానికి నా వంతు సేవ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ మొక్కలు పెరిగి పెద్దవైతే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చదనాన్ని అందిస్తాయి. కేవలం నాకు నేనుగా ఆనందించడం కాకుండా సమాజానికి, ప్రకృతికి మేలు చేయడం ద్వారా కలిగే ఆనందం గొప్పది. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

– గుద్ధ రంజిత్ కుమార్, గొల్లగూడెం

గొత్తికోయ గుంపులో కార్డెన్ సెర్చ్

మణుగూరుటౌన్: సంఘ విద్రోహశక్తులకు ఆశ్రయం కల్పించొద్దని, నక్సలైట్లకు నిత్యావసర వస్తువులు అందించొద్దని సీఐ నాగబాబు అన్నారు. శనివారం మండలంలోని మారుమూల గ్రామమైన రేగులగండి గొత్తికోయ గుంపులో మణుగూరు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అపరిచితుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



రేగులగండి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగబాబు

నిరుపేద విద్యార్థులకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మణుగూరురూరల్: నిరుపేద విద్యార్థుల చదువు కోసం బీసీ సంక్షేమ సంఘం ఆర్థిక భరోసా ఇవ్వనుందని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బుర్ర సోమేశ్వర్‌గౌడ్ తెలిపారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ గ్రహీత ఎండి.గౌస్ పాషా అధ్యక్షతన జరిగిన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ విద్యాసంస్థలైన రతన్ టాటా యూనివర్సిటీ–హైదరాబాద్, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ సోషల్‌లలో విద్యనభ్యసించేందుకు అర్హత కలిగిన విద్యార్థులకు సంఘం అవకాశం కల్పిస్తోందన్నారు. ఆయా కోర్సుల్లో మూడు సంవత్సరాల పాటు ఉచిత విద్య, ప్రతీ నెలా స్టైఫండ్ రూ.13,500లను ఇవ్వనుందన్నారు. హెల్త్‌ఇన్సూరెన్స్, ప్రమాద బీమా పాలసీ టాటా కంపెనీనే చేయిస్తుందన్నారు. వివరాలకు 9912462558, 8499940432 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వీరంకి వెంకట్రావు, కార్యదర్శి పెనుగొండ సాంబశివరావు, కోశాధికారి పొదిల వీరబాబు, పెనుగొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తొలగించిన పోలీసులు

గుండాల: వర్షాకాలం వస్తే కిన్నెరసాని వరద ఉధృతి పెరిగి లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరద పొర్లుతున్న నేపథ్యంలో ఈ సారి ఆ పరిస్థితి తలెత్తకుండా వాగులో అడ్డంగా ఉన్న రాళ్లను పోలీసుల ఆధ్వర్యంలో తొలగించారు. మండలంలోని కొడవటంచ సమీపంలో కిన్నెరసాని వాగులో బ్రిడ్జి పక్కన ఉన్న రాళ్లను శనివారం సీఐ రవీందర్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు తొలగించారు. సహకరించిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సై ఐదా రహూఫ్, సిబ్బంది మల్లయ్యలు ఉన్నారు.



జేసీబీలతో వాగులో రాళ్లను తొలగిస్తున్న పోలీసులు

ఆదివాసీలపై దాడులు అమానవీయం

బూర్గంపాడు: ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారుల దాడులు అమానవీయమని, ఈ దాడులు మానవ హక్కుల ఉల్లంఘనగానే పరిగణించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్ అన్నారు. ఇరవెండిలోని కొసగుంపు వలస ఆదివాసీలతో శనివారం బీఎస్పీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని భూభాగమంతా ఆదివాసీలకు చెందినదేనని, జీవన భృతి కోసం పోడుసాగు చేసుకుంటున్న ఆదివాసీల మహిళలపై దాడులు అప్రజాస్వామికమని అన్నారు. దాడులకు పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, పీక మల్లికార్జున్, కుమ్మరి రాంబాబు, గుగులోత్ సరోజని, భూక్యా ముత్యాలు, గౌతమ్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



కొసగుంపు ఆదివాసీలతో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

నేడు 'డయల్ యువర్ డీఎం'

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టికి తేవాలని ఆయన సూచించారు. అందుకోసం 99592 25960 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు.

గురుకులంలో దరఖాస్తులు

బూర్గంపాడు: బూర్గంపాడులోని తెలంగాణ గురుకుల పాఠశాల(బాలికలు)లో ఖాళీగా ఉన్న 6, 7, 8వ తరగతుల్లోని సీట్ల భర్తీ కోసం జూలై 2వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో జూలై 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై గ్రామసభ

గుండాల: మండల కేంద్రంలో శనివారం దర్తీ అభా జనబా గిదారి అభియాన్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శాం సుందర్ మాట్లాడుతూ.. రేషన కార్డులు, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డులు, పెన్షన్ యోజన, జన్‌ధన్ యోజన, గరీబ్ కల్యాణ్ యోజన, మాతృ వందన యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించేందుకు సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనేష్ రెడ్డి, పెసా కమిటీ సభ్యులు పెంటన్న, నర్సింహరావు, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, మాజీ ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

చర్ల: మండలంలోని లింగాపురంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు దాత సహకారంతో ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పరుచూరి మనోహర ప్రసాద్ ఆర్థిక సాయంతో ప్రధానోపాధ్యాయుడు పాండు రాజా ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ చైర్మన్ నీలి ప్రకాశ్, ఉపాధ్యాయులు జవ్వాది నరేంద్రబాబు, నరేష్, ప్రత్యూష, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

ములకలపల్లి: జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని టీయూసీఐ అనుబంధ తెలంగాణా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూపా భాస్కర్, గోనెల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ గద్దె రేవతికి వినతిపత్రం అందజేశారు. జూలై 9వ తేదీన జరుపతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కోంద్రు శ్రీను, గడ్డం నాగరాజు, కొర్సా వెంకట్, నరేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

మణుగూరుటౌన్: మండలంలోని తోగ్గూడెం, కట్టుమల్లారం, ముత్యాలమ్మనగర్, లంక మల్లారం పంచాయతీల్లోని పలు వీధుల్లో శనివారం రూ.66 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ఎంపీపీఎస్ స్కూల్‌లో ప్రహరీగోడను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా ప్రజాభవన్‌లో రైతులకు చిరుసంచులు అందజేశారు. ప్రజాభవన్ కార్యాలయంలో పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజాభవన్ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు తాతారావు, మండల వ్యవసాయ అధికారి రాహుల్‌రెడ్డి, ఏఈఓ లక్ష్మణరావు, పీవీ జయంతి కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ, యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పినపాక: మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల్లో 65 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. టీ కొత్తగూడెం, అమరారం, కిష్టాపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తాతారావు, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ వినీత, మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: ముత్యాలమ్మ నగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

ప్లాంటేషన్ వద్ద గిరిజనుల ధర్నా



టేకు ప్లాంటేషన్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రామన్నగూడెం వద్ద అటవీశాఖ ఆధీనంలో ఉన్న టేకు ప్లాంటేషన్ ఎదుట ప్రధాన రహదారిపై గిరిజనులు శనివారం ధర్నా చేపట్టారు. రామన్నగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 30, 36, 39లో గిరిజనులకు ఉన్న పట్టాభూములను తక్షణమే జాయింట్ సర్వే చేసి తిరిగి అప్పగించాలని, హైకోర్టు, ఉమ్మడి జిల్లా కలెక్టర్ సిద్దార్థజైన్ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారంతా రహదారిపై బైఠాయించారు. దీంతో రాకపోకలు చేస్తున్న వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక సీఐ నాగరాజు రెడ్డి, అదనపు ఎస్సై రామ్మూర్తి, ట్రైనీ ఎస్సై అఖిలతోపాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న గిరిజనులతో చర్చించారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్న ఆధారాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. దీంతో శాంతించిన గిరిజనులు ధర్నాను విరమించారు.

గొత్తికోయలగూడెంలో వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామ శివారు అటవీప్రాంతంలోని మంగళిబోడులో ఉంటున్న గొత్తికోయలగూడెంలో శనివారం ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ప్రకాశ్‌రావు, సిబ్బంది భవాని, రాందాసు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అంబేడ్కర్ సెంటర్‌లోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా షేక్ మీరాహుస్సేన్, కార్యదర్శిగా ఎం శ్రీనివాసరావు, కోశాధికారిగా అడబాల నాగేశ్వరరావులు ఎన్నిక కాగా.. ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కాపా మురళీకృష్ణ, ధార కృష్ణారావులు వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు, ఇండక్షన్ ఆఫీసర్ సూర్యనారాయణ, జెడ్‌సీ భూక్యా ప్రసాద్, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల పూర్ణచందర్‌రావు, ప్రోగ్రామ్ చైర్మన్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థి కేబినెట్

దుమ్ముగూడెం: నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి ఆదిరెడ్డి నాగలక్ష్మమ్మ జిల్లా పరిషత్ పాఠశాలలో సారపాక ఐటీసీ, పీఎస్‌పీడీ అనుసంధానమైన ఎంఎస్‌కే ఆధ్వర్యంలో ఆరు నుంచి పది తరగతుల లీడర్లతో ప్రజాస్వామ్యబద్ధమైన విద్యార్థుల కేబినెట్‌ను శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కేబినెట్‌ల మూలంగా పాఠశాలలో మంచి క్రమశిక్షణ పెంపొందడంతోపాటు, పాఠశాల దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన ఏర్పడుతుందని ఎంఎస్‌కే ప్రాజెక్ట్ ప్రతినిధి రాజకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ రమణ, పి.విజయ బాబు, ఐటీసీ ఎంఎస్‌కే ప్రతినిధి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ములకలపల్లి: నిమ్మకాయలు కోశారంటూ ఇద్దరు చిన్నారులను దూషించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు కథనం మేరకు చాపరాలపల్లి గ్రామానికి చెందిన కాలేపల్లి కిషోర్ తొమ్మిదేళ్ల కుమారుడు, అతని స్నేహితుడు ఈనెల 16న కలసి వెళుతుండగా, గ్రామానికి చెందిన వాసిరెడ్డి సురేశ్ తన చెట్టు నిమ్మకాయలు కోశారంటూ ఇద్దరిని బెదిరించి, బూతులు తిట్టి, మందలించి వదిలేశాడు. ఈ విషయం తెలిసిన కిషోర్, సురేశ్ ఇంటికి వెళ్లగా ఇద్దరు పిల్లలు నిమ్మకాయలు కోశారంటూ అసభ్యపదజాలంతో దాడికి పాల్పడ్డారు. కిషోర్‌ను చంపుతానని బెదిరించాడు. బాధితుడు కిషోర్ శనివారం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

'మత్తు కోసం బోనోఫిక్స్'

భద్రాచలంఅర్బన్: మద్యం, గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్న యువకులు సైకిల్ టైర్ పంక్చర్ వేసేందుకు వినియోగించే బోనోఫిక్స్ కూడా వినియోగిస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డు ఉన్న నన్నపనేని మోహన్ ప్రభుత్వ పాఠశాల ఎదుట శనివారం ఓ యువకుడు బోనోఫిక్స్‌ను కవర్‌లో పెట్టుకుని పీల్చుతున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బోనోఫిక్స్ విక్రయాలపై అధికారులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆటోడ్రైవర్ ఎస్.శివకు గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దగ్గర ఆటో యూటర్న్ తీసుకుంటుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో డివైడర్‌ను ఢీకొనగా.. కారు రోడ్డు పక్కనే ఉన్న బార్బర్‌షాపు బడ్డీలోకి దూసుకెళ్లింది. ఈనేపథ్యాన షాపు వద్ద ఉన్న ఓ బైక్ ధ్వంసమవగా.. క్షతగాత్రుడిని కొత్తగూడెంకు తరలించారు.

గిరిజన మ్యూజియం సందర్శన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సెయింట్ పాల్ పాఠశాల విద్యార్థులు గిరిజన మ్యూజియాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అబ్రహం.. మ్యూజియంలోని ప్రతి వస్తువును విద్యార్థులకు పరిచయం చేస్తూ వివరించారు. పాఠశాల అధ్యాపకులు రమాదేవి, కృష్ణవేణి, చైతన్య, రమణి, రాగిణి, ప్రవీణ్, ఉపేంద్ర మ్యూజియం నిర్వహకులు డీఎస్‌ఓ ప్రభాకర్ రావు వీరాస్వామి, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువు దీరిన పీరీలు..

మొహర్రం వేడుకలు ప్రారంభం

కరకగూడెం: ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలకు నూతన సంవత్సర మొదటి నెల అయిన మొహర్రం మాసం ప్రారంభంతో త్యాగానికి ప్రతీకగా నిలిచే 'మొహర్రం' వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం కరకగూడెం మండల కేంద్రంలోని 'పీరీల చావడి'వద్ద భక్తిశ్రద్ధలతో పీరీలను కొలువుదీర్చారు.

మొహర్రం నేపథ్యమిదీ..

మొహర్రం మాసం ఇస్లాం చరిత్రలో ముఖ్యంగా షియా ముస్లింలకు అత్యంత పవిత్రమైన, దుఃఖపూరితమైన మాసం. ప్రవక్త మొహమ్మద్ మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ కర్బలా యుద్ధంలో అమరుడైన త్యాగాన్ని ఈ నెల గుర్తు చేస్తుంది.ఈ త్యాగానికి గుర్తుగా పీరీలను కొలువుదీరుస్తారు.

పీరీలను నెలకొల్పు ఇలా..

పీరీలను కొలువుదీర్చే బాధ్యతను ముజావర్లు అనే ప్రత్యేక వ్యక్తులు నిర్వహిస్తారు. వీరు పీరీలను సంప్రదాయబద్ధంగా శుద్ధి చేసి, అలంకరించి, నిర్ణీత ప్రదేశాల్లో స్థాపిస్తారు. వివిధ రంగుల వస్త్రాలు, పూలు,దండలు,అలంకరణ వస్తువులతో అద్భుతంగా అలంకరిస్తారు. ఇది వాటి పట్ల భక్తిని, గౌరవాన్ని తెలియజేస్తుంది. పీరీలను కొలువుదీర్చిన తర్వాత ముజావర్లు, భక్తులు ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ప్రార్థనలు ముగిసిన తర్వాత, భక్తులకు పవిత్రమైన తబర్రుక్ (ప్రసాదం వంటిది) పంపిణీ చేస్తారు.



కరకగూడెంలో కొలువుదీరిన పీరీల వద్ద భక్తుల ప్రార్థనలు